ముమ్మరంగా ఎన్‌సీడీ సర్వే..

జూబ్లీహిల్స్, మార్చి 3: నాన్ కమ్యూనికల్ డిసీజెస్‌ను గుర్తించేందుకు ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. వైద్య శాఖ ఆదేశాలతో ప్రతి ఇంటికి సర్వే బృందాలు వెళ్లి ఇంటివద్దే ఎన్‌సీడీ స్క్రీనింగ్ చేస్తున్నారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యలను గుర్తించేందుకు 30 నుంచి 60 ఏండ్లు పైబడిన వారికి పరీక్షలు చేస్తున్నారు. శ్రీరామ్‌నగర్ క్లస్టర్‌లోని జూబ్లీహిల్స్, వినాయక్ నగర్, బోరబండ, శ్రీరామ్ నగర్ పీహెచ్‌సీల పరిధిలోని ప్రతి బస్తీ, కాలనీల్లో సర్వే చేస్తున్నారు. మార్చి 31 లోపు సర్వే పూర్తి చేసే లక్ష్యంతో బస్తీల్లో స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ బి. విజయ నిర్మల తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ, మార్చి 3: పార్లమెంట్లో ఆమోదం పొందిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటాను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మహిళలకు 50% కల్పించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో మహిళా భేరిని నిర్వహించనున్న తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ద్వారా మహిళల బేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళా భేరికి మద్దతి పలకాలని విజ్ఞప్తి చేశారు. రామన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం మహిళలకు సంబంధించిన సబ్ కోటాను ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. స్వప్న, రామ శ్రీనివాస్, ఉదయనేత, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'గుడ్ మార్నింగ్ మణికొండ'

- నాయకులకు సమస్యల గోడు వినిపించిన ప్రజలు
- తాగునీటికి తల్లడిల్లుతున్నామని వెల్లడి

మణికొండ, మార్చి 3: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మణికొండ మునిసిపాలిటీ పరిధిలో సోమవారం 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరుతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుప్పాలగూడ-నార్సింగి రోడ్డులోని కులీకుతుబ్‌షాహీ నగర్‌లో విస్తృతంగా పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతుందని, అది కూడా అరగంట మాత్రమే వస్తున్నాయని తెలిపారు. దాంతో పూర్తిగా ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తున్నదని స్థానికులు వాపోయారు. ఎక్కువ డబ్బులు పెట్టి తాగునీరు కొనాల్సి వస్తుందని కాలనీవాసులు బీఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకొచ్చారు.

దుర్గంధభరితంగా ముష్కం చెరువు

అదేవిధంగా ముష్కం చెరువులో చెత్తా చెదారం వేయడంతో దుర్గంధభరితంగా మారిదోమల బెడద తీవ్రంగా ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. విషయాన్ని మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు పూర్తిగా అన్యక్రాంతమవుతుందని, అధికారులు స్పందించాలని కోరినట్లు బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. రాత్రిపూట వీధి దీపాలు పనిచేయడం లేదన్నారు. సీసీ కెమెరాలు లేక దొంగలు బెడద పెరిగిందని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల, నాయకులు నరేందర్, శ్రీకాంత్, విఠల్, మాల్యాద్రి నాయుడు, ఉపేందర్నాథ్‌రెడ్డి, శ్రీకాంత్, ఆరిఫ్, ప్రవీణ్, సుమనళిని, శ్రీధర్, రమణమూర్తి, భాస్కర్‌గౌడ్, రేఖ,రామాంజనేయులు, పవన్ పాల్గొన్నారు.

కులీకుతుబ్‌షా కాలనీలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సాగర్ రోడ్డులో కారు బీభత్సం

- భారీగా హెచ్ఎండీఏ ఆస్తుల నష్టం
- ప్రయాణికులంతా మైనర్లు
- తప్పిన ప్రాణాపాయం

ఖైరతాబాద్, మార్చి 3: సాగర్ రోడ్డులోని ఎన్టీఆర్ గార్డెన్ ఎదుట ఓ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చి సాగర్ పుట్‌పాత్‌పై ఉన్న ఈతచెట్టు, ఇతర కట్టడాలను బలంగా ఢీకొట్టడంతో పెద్ద ఎత్తున హెచ్ఎండీఏ ఆస్తులు ధ్వంసమయ్యాయి. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన జరిగింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారెడ్‌పల్లికి చెందిన బాలుడు (17) ఇంట్లో చెప్పకుండా కియా కారును తీసుకొని బయల్దేరాడు. దారిలో ఇద్దరు స్నేహితులపే(మైనర్లు) ఎక్కించుకొని నగరంలో చక్కర్లు కొట్టాడు. అత్యంత వేగంగా ఖైరతాబాద్ రోటరీ చౌరస్తా మీదుగా వెళ్తూ.. ఎన్టీఆర్ రోడ్ ఎక్కగానే కారు అదుపు తప్పింది. తొలుత ఓ స్ట్రీట్ లైట్ స్తంభాన్ని, అంతేవేగంతో ఓ చెట్టును ఢీకొట్టగా కూలిపోయాయి.సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసి రెండు ప్లాంటర్ బాక్సులను ఢీకొనడంతో అవి పగిలిపోయాయి. చివరకు సాగర్ రోడ్డుపై ఉన్న రైలింగ్‌ను ఢీకొట్టి కారు పల్టీ కొట్టింది. కారులో అన్ని ఏయిర్ బెల్లూను తెరుచుకోవడంతో కారు నడుపుతున్న బాలుడికి స్వల్ప గాయాలు కాగా ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరు మైనర్లకు ఎలాంటి గాయాలు కాలేదు. వారిదనై కారు దిగి పారిపోయారు. ఈ ప్రమాదంలో హెచ్ఎండీఏ ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి.

కారు బీభత్సానికి హెచ్ఎండీఏకు సంబంధించిన సుమారు రూ.5లక్షల విలువైన ఆస్తులు ధ్వంసమైనట్లు తెలిసింది. ఈ ప్రమాదంతో ఎన్టీఆర్ ఘాట్ రోడ్ లో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అక్కడికి చేరుకున్న సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. సాయంత్రం హెచ్ఎండీఏ ఈఈ శంకర్ సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అలరించిన కథక్ నృత్య ప్రదర్శన

కథక్ నృత్యం చేస్తున్న న్యూయార్క్‌కు చెందిన బర్కా పటేల్

బంజారాహిల్స్, మార్చి 3: బంజారాహిల్స్ రోడ్ నంబర్-3లోని ఆధ్యం హ్యాండ్ ఓవెన్, ఓరో జూవెల్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన కథక్ నృత్య ప్రదర్శన కళాభిమానులను అలరించింది, న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ కథక్ నృత్యకారిణులు బర్కా పటేల్, తన్వీనర్ ఆలం నృత్యాలతో సందడి చేశారు. సంస్కృతీ సంప్రదాయాన్ని కలబోసేలా వారు చేసిన నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, ఉప ముఖ్యమంత్రి సతీమణి నందిని మల్లు, టర్కీ కాన్సులేట్ జనలర్ ఉర్వాన్, ఫిక్కీలేడీస్ అసోసియేషన్ చైర్ పర్సన్ ప్రియా గుజ్జర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే సమావేశం

మెహదీపట్నం/ చాంద్రాయణగుట్ట, మార్చి 3 : ప్రజలకు రంజాన్ మాసంలో పారిశుధ్య సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకు నేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. దీనికి స్పందించిన జూనల్ కమిషనర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తానని తెలిపారు. అదేవిధంగా రంజాన్ మాసంలో ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యేలు కోరారు. సోమవారం జలమండలి కార్యాలయంలో అశోక్ రెడ్డిని ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్, బహదూర్ పుర ఎమ్మెల్యే ముబీన్లు కలిసి మంచినీటి సమస్యలపై చర్చించారు. ఎండాకాలం రంజాన్ మాసం కావడంతో ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

హిమాయత్‌నగర్, మార్చి 3: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలుచేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న పలు రంగాల్లో విశేష సేవలందిస్తున్న బీసీ మహిళలను గుర్తించి సత్కరించనున్నట్లు ఆయన చెప్పారు. ఉత్పత్తి కులాలైన బీసీలు వెనుకబాటుతనం నుంచి విముక్తి పొందాలంటే వారికి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కులగణన ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి, విద్యా,ఉపాధి రంగాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎల్ ఆర్ఎస్ రెగ్యులరైజేషన్‌కు మార్చి 31 వరకు గడువు

మణికొండ మార్చి 3 : ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)లో భాగంగా గతంలో 1000 రూపాయలతో దరఖాస్తులు చేసుకున్న వారికి ఈనెల 31 వరకు గడువు ఇస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని సోమవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల కమిషనర్లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల అనుసారం.. 2020లో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం రిజిష్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులకు అనుమతి లేని, లే అవుట్ల లోని ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 31 వరకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఈలోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే వారికి ప్రభుత్వం 25శాతం రాయితీ కూడా ప్రకటించిందని తెలిపారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని, ఇతర సందేహాలకు మణికొండ మున్సిపాలిటీలోని(సెల్ :8341912912) సహాయక కేంద్రంలో సంప్రదించాని కమిషనర్లు పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై రాయితీని సద్వినియోగం చేసుకోండి..

బండ్లగూడ : బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులంతా 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బందికి ఎల్ఆర్ఎస్ పరిశీలనపై పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫీజు చెల్లించాలని ఇదివరకే సమాచారం వచ్చిన వారు కూడా 25 శాతం రాయితీకి అర్హులేనన్నారు. ఎల్ఆర్ఎస్‌పై కాల్ సెంటర్‌తో పాటు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ప్రజావాణి వినతులకు తక్షణ పరిష్కారం

ప్రజావాణిలో వినతులను పరిశీలిస్తున్న డీసీ జాకియా సుల్తానా

జూబ్లీహిల్స్,మార్చి 3: ప్రజావాణి వినతులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి తక్షణమే పరిష్కారం చూపాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా అధికారులను ఆదేశించారు. సోమవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీసీ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్‌రాజ్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ : వినతులు స్వీకరిస్తున్న ఉప కమిషనర్ రవికుమార్

ప్రజావాణికి మూడు ఫిర్యాదులు

బండ్లగూడ : రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉప కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు ఫిర్యాదులు అందినట్లు ఉప కమిషనర్ తెలిపారు. ఒకటి శానిటేషన్‌కు సంబంధించినది కాగా రెండు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవని, వాటిని సంబంధిత అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

7న రికార్డు ఫీటు 'జానపద నృత్య ప్రదర్శన'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేదకీర్తి, సరితాసింగ్ తదితరులు

ఖైరతాబాద్, మార్చి 3 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా క్రివీ ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న సికింద్రాబాద్‌లోని కస్తూర్బా మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో వెయ్యిమంది విద్యార్థినులతో 'తెలంగాణ జానపద నృత్య కార్యక్రమాన్ని' నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వేద కీర్తి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. సేవ్ గర్ల్ చైల్డ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వెయ్యి మంది విద్యార్థినులు ఏకకాలంలో తెలంగాణ జానపద నృత్యం చేస్తారని, ప్రపంచంలో ఇలాంటి ఫీటు ఎక్కడా జరగలేదన్నారు. లిమ్కా, ఆరెంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడమే లక్ష్యమని అన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఫౌండేషన్ ప్రతినిధులు సరితాసింగ్, దిశా వైష్ణవ్, బ్లెస్సీ, అనఘా, దీపక్‌సింగ్‌తో కలిసి ఆవిష్కరించారు.

6న దివ్యాంగులకు ఉపకరణాల అందజేత

శంషాబాద్ రూరల్, మార్చి 3 : దివ్యాంగులకు ఉపకరణాల అందజేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భిక్షమమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న శంషాబాద్ పట్టణంలోని మహిళా సమఖ్య భవనంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు వికలాంగ ధ్రువీకరణ పత్రంతోపాటు 40శాతం వైకల్యం కలిగి ఉండాలని, కుటుంబ ఆదాయం ఏడాదికి 2,70,000 రూపాయలు ఉండాలని తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల దివ్యాంగులు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఎంపిక చేసిన వారికి వినికిడి యంత్రాలతోపాటు అవసరమైన పరికరాలు అందజేస్తామని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఎర్రగడ్డ, మార్చి 3: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నులిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌతంపురి కాలనీ, మిడిలాండ్ బేకరీ ఏరియా, బాలాజీ స్వర్ణపురి కాలనీ, నటరాజనగర్, రాజీవ్‌నగర్, సుల్తాన్‌నగర్, నేతాజీనగర్, శంకర్‌లాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్‌ను రెండో రాజధాని చేయాలి

చిక్కడపల్లి, మార్చి 3: దేశ రక్షణ కోసం హైదరాబాద్ రెండో రాజధానిగా చేయాలని ప్రకాశ్‌యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. సోమవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం రెండో రాజధానిగా హైదరాబాద్ ఏర్పాటు చేయాలని అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాశ్‌యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోణంలో హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బలంగా కోరే వారని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ పాకిస్తాన్ సరిహద్దు నుంచి 300 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. దేశ రాజధానికి శత్రువు అంత దగ్గరగా ఉండడం శ్రేయస్కరం కాదని చెప్పారు. భారత్ బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలంటే కుల,మతాలకతీతంగా ఐక్యం కావాలన్నారు.

పాదచారుల వంతెన కథ.. కంచికేనా!

- హిమాయత్‌నగర్‌లో ఐదేండ్లు దాటినా ముందుకు సాగని ఎఫ్ఓబీ పనులు
- గుంతలు తవ్విన చోట సీసీ రోడ్డు ఏర్పాటు
- రోడ్డు దాటాలంటేనే హడలిపోతున్న పాదచారులు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

హిమాయత్‌నగర్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

హిమాయత్‌నగర్, మార్చి 3: నగరంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటాలంటేనే పాదచారులు హడలిపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదు. వివరాల్లోకి వెళ్తే.. హిమాయత్‌నగర్ డివిజన్‌లో పాదచారుల సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అంద జేయడంతో గత ప్రభుత్వం రూ.2.5 కోట్ల నిధులను సైతం మంజూరు చేసింది. దాంతో 2020 ఆగస్టులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి హిమాయత్ నగర్‌లో రోడ్డును తవ్వి పనులను ప్రారంభించారు. ఈ బ్రిడ్జి ఏర్పాటుతో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని భావించిన కొందరు పనులను అడ్డుకోవడంతో వివాదంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

ఈ నేపథ్యంలో వంతెన కోసం తవ్విన గుంతల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని జీహెచ్ఎంసీ అధికారులు గుంతలు పూడ్చి అక్కడ సీసీ రోడ్డు వేయించారు. హిమాయత్ నగర్ ప్రధాన మార్గంలో రోడ్డు దాటాలంటే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతంలో అధిక శాతం విద్య, వ్యాపార సంస్థలు, బ్యాంకులు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం ఏదో పని నిమిత్తం రాకపోకలు సాగించే వారు రోడ్డు దాటాల్సిన పరిస్థితి. వేగంగా వచ్చే వాహనాలను దాటుకుంటూ వెళ్లడం అనేది కత్తిమీద సాములా మారింది. పలు సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి.

ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్- 16 ఈఈ రమేష్‌బాబును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఎఫ్ఓబీ పనులను వెంటనే చేపట్టాలి..

ఏండ్లు గడుస్తున్నా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరగకపోవడంతో అతివేగంగా వచ్చే వాహనాలను తప్పించుకుని రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నాం. పెరుగుతున్న ట్రాఫిక్ వల్ల రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందికరంగా ఉన్నది. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి.

– డి.రాజేందర్‌కుమార్, హిమాయత్‌నగర్

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా సురేందర్

ఎర్రగడ్డ, మార్చి 3: బోరబండ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా మల్కాపురం సురేందర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సురేందర్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వీరశేఖర్‌ను చార్మినార్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేస్తూ సీపీ నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా బోరబండ నూతన ఇన్‌స్పెక్టర్‌కు ఎస్సైలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బార్ అసోసియేషన్ హాల్ ప్రారంభం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మార్చి 3(నమస్తే తెలంగాణ): నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ల కోసం ప్రత్యేకంగా నిర్మించిన బార్ అసోసియేషన్ హాల్‌ను సోమవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, పుల్లా కార్తిక్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ సీనియర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక హాల్‌ను వినియోగించుకోవాలని, అన్ని సదుపాయాలతో హాలు నిర్మాణం చేపట్టినందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డితో పాటు సభ్యులను అభినందించారు. అదేవిధంగా బార్ అసోసియేషన్ ప్రధాన హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టర్‌ను సైతం ప్రారంభించారు.

హనుమంత వాహనంపై శ్రీనివాసుడు

హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బంజారాహిల్స్, మార్చి 3: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీనివాసుడు హనుమంత వాహనంపై ఊరేగారు. గోవింద నామస్మరణతో భక్తులు పరవశించి పోయారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కోలాటాలు, భజనలతో అలరించారు. మధ్యాహ్నం రథ రంగ డోలోత్సవం, సాయంత్రం గజవాహన సేవ నిర్వహించారు.

నేడు దర్శకుడు వంశీ సినీ స్వర్ణోత్సవం

రవీంద్రభారతి, మార్చి 3 : సితార,అన్వేషణ, లేడీస్ టైలర్, ఆలాపన వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన వంశీ సినీ స్వర్ణోత్సవం నేడు రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) గాయని శారద(అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వంశీరామరాజు, శారద అకూనూరి ప్రతికా సమావేశంలో తెలిపారు. ముఖ్య అతిథిగా నటుడు రాజేంద్రప్రసాద్ పాల్గొని వంశీని సత్కరించనుండగా, సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అధ్యక్షత వహిస్తారని అని తెలిపారు. అతిథులుగా రచయిత వేమూరి సత్యనారాయణ, సినీ ఆటోగ్రాఫర్‌లు ఎంఏ రఘుహరి అనుమొలు, నిర్మాత ఏడిద రాజా పాల్గొంటారు. సభా కార్యక్రమానికి తొలుత శారద నిర్వహణలో వంశీ సినిమాల్లోని సినీగీతాల విభవారి ఉంటుందని వంశీరామరాజు తెలిపారు.

ఆక్రమణలను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి

హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు

అబిడ్స్, మార్చి 3: మహదేవ్ ఆలయ భూమి ఆక్రమణపై బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫీల్‌ఖానాలోని మహదేవ్ ఆలయం స్థల విషయమై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ ఆస్తి అయిన ఆలయ భూమిలో బిల్డర్స్ చేపట్టిన అక్రమ నిర్మాణం గురించి లక్ష్మణ్ రావు కలెక్టర్‌కు తెలిపారు. అనధ